సీతంపేటలో నేడు జీపుయాత్ర ప్రారంభం

ప్రజాశక్తి - సీతంపేట

ఏజెన్సీ స్పెషల్ డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలని, మెగా డీఎస్సీ నుంచి ఏజెన్సీ టీచర్ పోస్టులు మినహాయించాలని, జిఒ 3ను పునరుద్ధరించాలని కోరుతూ ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యాన తలపెట్టిన జీపు యాత్ర శనివారం సీతంపేటలోని అల్లూరి సీతారామరాజు విగ్రహం వద్ద ప్రారంభిస్తున్నట్లు ఆదివాసీ గిరిజన సంఘ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.తిరుపతిరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జీపుయాత్రలో సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోతా రాంబాబు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర రాష్ట్ర నాయకులు అశోక్ పాల్గొంటారని తెలిపారు. జూన్ 4 వరకు ఈ యాత్ర సాగుతుందన్నారు. సీతంపేటలో ప్రారంభమై భామిని, గుమ్మలక్ష్మీపురం, కురుపాం, జియ్యమ్మవలస, పార్వతీపురం, మక్కువ, సాలూరు, పాచిపెంట మీదు జీపు యాత్ర సాగుతుందని తెలిపారు.

పండగకు కష్టాల్లేకుండా చేస్తారా?

- ఇప్పటికీ బుదరనీరు, విద్యుత్తు కోతలు
- పట్టణ వాసుల్లో ఆందోళన
- 1,2,3 తేదీల్లో ఇప్పలపోలమ్మ పండగ

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలో పలు ప్రాంతాల్లో గ్రామదేవతల పండగలు ముమ్మరంగా జరుగుతున్నాయి. మార్చి నుంచి జూన్ వరకు గ్రామాల్లో ఆయా గ్రామదేవతల పండగలు జరిగాయి. ఈనెల 18, 19, 20, 21 తేదీల్లో సాలూరు శ్యామలాంబ పండగ జరిగింది. ఈ పండగ సందర్భంగా ప్రజలు ఎదుర్కొన్న కరెంట్ కష్టాలు మీడియాలో పతాక శీర్షికలతో వచ్చాయి. పండుగ మూడు రోజుల పాటు విద్యుత్ సరఫరా లేకపోవడంతో జనం కట్టలు తెంచుకున్న ఆగ్రహంతో ఊగిపోయారు. ముందు చూపు, ముందస్తు ప్రణాళిక లేకపోవడంతో నిరంతర విద్యుత్ సరఫరాలో అధికారులు విఫలమయ్యారు. గ్రామాల్లో పండగలకు విద్యుత్ సరఫరా పెద్ద సమస్యే లేదు. పట్టణాలు, నగరాల్లో పండగలైతే లక్షల్లో జనం హాజరయ్యే అవకాశం ఉంది. గత రెండు నెలలుగా జిల్లాలోని పలు మండలాల్లో గ్రామదేవతల పండుగలు జరిగాయి. జూన్ 1,2,3 తేదీల్లో పార్వతీపురంలో గ్రామదేవత పండగ జరగనుంది. రెండేళ్లకో సారి జరిగే ఈ పండగ కూడా అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది. ఇప్పలపోలమ్మ, ఎర్రి కంచమ్మ, బంగారమ్మ దేవతల పండగలు ఆ మూడు రోజులు జరుగనున్నాయి. పట్టణంలోని ప్రజలు వారి వారి ఆచార, సాంప్రదాయాలకు అనుగుణంగా పండుగ జరుపుకోవడానికి ఏర్పాట్లు చేసుకుంటున్నారు. రెండేళ్లకోసారి నిర్వహించే పండగ కావడంతో దగ్గర బంధువులు మాత్రమే హాజరయ్యే అవకాశం ఉంది. అయితే రెండు లక్షల వరకు భక్తులు హాజరవుతారని అంచనా వేస్తున్నారు.

విద్యుత్ కోతలు ఉండవా?

పండుగ మూడు రోజుల్లోనైనా విద్యుత్ కోతలు లేకుండా ఉండాలని ప్రజలు కోరుకుంటున్నారు. గత కొద్ది రోజులుగా పట్టణంలో విద్యుత్ లైన్ల మరమ్మతు పనులు, మెయింటెనెన్స్ కారణంగా విద్యుత్ సరఫరాలో తీవ్ర ఆటంకాలను పట్టణ వాసులు ఎదుర్కొన్నారు. ఇప్పుడే ఇలా ఉంటే పండుగ రోజుల్లో ఎన్ని కోతలు విధిస్తారోనని ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. సాలూరు శ్యామలాంబ పండగలో ఎదురైన అనుభవాలను దృష్టిలో ఉంచుకుని జిల్లా అధికారులు విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు తీసుకుంటారా లేదా అని వారు ఎదురుచూస్తున్నారు. ఈ మేరకు శుక్రవారం ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర విద్యుత్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. కోతలు లేకుండా విద్యుత్ సరఫరా చేయాలని వారిని ఆదేశించారు.

బురద నీరు లేకుండా చూస్తారా?

పార్వతీపురం పట్టణంలో తరచూ కలుషిత తాగునీరే ప్రజలకు గత్యంతరమవుతోంది. కొద్దిరోజుల క్రితమే ప్రజలు బురదనీటిని వినియోగించారు. గత కొన్నేళ్లుగా తాగునీటి సమస్యని పట్టణ వాసులు ఎదుర్కొంటున్నా పాలకులు పరిష్కరించే దిశగా అడుగులు వేయలేదు. తోటపల్లి జలాశయం నుంచి తాగునీటి సరఫరాకు సంబంధించి పురాతన పైపులైన్ వ్యవస్థ వుండడంతో అక్కడక్కడ లీకేజీ సమస్యలు ఉన్నాయి. ఫలితంగా తాగునీటిలో బురద నీరు కలిసిపోతుండడంతో కలుషిత నీటినే పేద, మధ్యతరగతి ప్రజలు వినియోగించాల్సిన పరిస్థితి ఏర్పడింది. అయితే పండగ రోజుల్లోనైనా మున్సిపల్ అధికారులు రక్షిత మంచినీటి సరఫరా చేస్తారా లేదా అన్నది ప్రశ్నార్థకంగా మారుతోంది. కలుషిత నీటి సరఫరా జరిగితే పండగ సమయాల్లో అంటువ్యాధులు ప్రబలే అవకాశాలు ఉన్నాయి. ఈ సమస్యని మున్సిపల్ అధికారులు ఏమేరకు అధిగమిస్తారో వేచి చూడాల్సిందే మరి.

పండగకు విద్యుత్తు ఇబ్బందులు కలగకుండా చూడాలి : ఎమ్మెల్యే

పార్వతీపురంరూరల్ : ఇప్పల పోలమ్మ, ఎర్ర కంచమ్మ, బంగారమ్మ పండగల్లో ఎలాంటి లోటుపాట్లు రాకుండా చూడాలని ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర అధికారులను ఆదేశించారు. శుక్రవారం తన క్యాంపు కార్యాలయంలో మున్సిపల్, పోలీస్, విద్యుత్ శాఖ అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. పండుగలో భక్తులకు ఎలాంటి ఇబ్బంది రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, సరిపడాగా తాగునీరు సరఫరా చేయాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. శాంతి భద్రతలు, ట్రాఫిక్ సమస్యలు లేకుండా చూడాలని పోలీసులకు సూచించారు. పండగలో విద్యుత్ సరఫరాకు ఎలాంటి ఆటంకం లేకుండా చూడాలని, సిరిమాను తిరిగే సమయంలో ప్రమాదాలకు ఆస్కారం లేకుండా చర్యలు చేపట్టాలని విద్యుత్ శాఖ అధికారులకు నిర్దేశించారు. అవసరమైన మేరకు సిబ్బందిని అదనంగా నియమించి ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్, డిఇ, టిపిఒ, ఎలక్ట్రికల్ అధికారులు పాల్గొన్నారు..

సిరిమాను చెట్లకు పూజలు

సిరిమానును కొడుతున్న ఉత్సవ కమిటీ సభ్యులు

పార్వతీపురం టౌన్ : ఇప్పల పోలమ్మ, ఎర్ర కంచెమ్మ అమ్మవార్ల పండగ జరుగుతున్న నేపథ్యంలో అమ్మవార్ల సిరిమానోత్సవాలకు కావాల్సిన సిరిమాను చెట్లను ఆయా ఉత్సవ నిర్వహణ సభ్యులు శుక్రవారం అమ్మవార్ల గుడి నుంచి బయలుదేరి బుగత జగన్నాథం, రెడ్డి సీతారాంకు సంబంధించిన కల్లాల్లో గుర్తించి ప్రత్యేక పూజలు నిర్వహించి, అమ్మవార్ల గుడి ప్రాంగణాలకు తీసుకొచ్చారు. పండగ ఊరేగింపునకు అవసరమైన ఈ సిరిమానులను సిద్ధం చేసేందుకు వంశపారంపర్య విశ్వబ్రాహ్మణులైన చిట్టూరి వంశస్తులు ప్రణాళికలను సిద్ధం చేస్తున్నారు. ఈ సిరిమాను చెట్లను ఊరేగింపుగా తీసుకువచ్చేందుకు రెండు ఉత్సవ కమిటీ సభ్యులతో పాటు ఎక్కువమంది యువత స్వచ్ఛందంగా పాల్గొన్నారు.

ప్రతిరోజూ తాగునీరు సరఫరా చేయాలి

పట్టణ పౌర సంక్షేమ సంఘం, సిఐటియు వినతి

పార్వతీపురం టౌన్ : పార్వతీపురం గ్రామ దేవత పండగ సమీపిస్తున్న వేళ పట్టణ ప్రజలకు అవసరమైనంత మంచినీటి సరఫరా చేయాలని, విద్యుత్ సరఫరాలో ఆటంకాలు లేకుండా చూడాలని, పారిశుధ్యం మెరుగునకు, దోమల నివారణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం మున్సిపల్ మేనేజర్ లక్ష్మి, విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వేణుగోపాలనాయుడుకు పట్టణ పౌర సంక్షేమ సంఘం, సిఐటియు ఆధ్వర్యంలో వినతి పత్రాలు అందజేశారు. అనంతరం ప్రజాసంఘాల నాయకులు పాకల సన్యాసిరావు, గొర్లి వెంకటరమణ, బివి రమణ మాట్లాడుతూ మంచినీటి సరఫరాలో ఉన్న సమస్యలను అధిగమించి పూర్తిస్థాయిలో మంచినీటి సరఫరా చేసేందుకు శాశ్వత చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. అలాగే పారిశుధ్యం మెరుగునకు చర్యలు చేపట్టాలని, దోమల నివారణకు తక్షణమే ఫాగింగ్ ప్రక్రియ ప్రారంభించాలని డిమాండ్ చేశారు. పండగ వేల విద్యుత్ వినియోగం ఎక్కువగా ఉంటుందని, కావున సరిపడా ట్రాన్స్ఫార్మర్లు, సిబ్బందిని సమకూర్చి పట్టణంలో విద్యుత్ సరఫరాకు ఆటంకం లేకుండా చర్యలు చేపట్టాలని విద్యుత్ శాఖ అధికారులను కోరారు. దీనికి విద్యుత్ శాఖ ఇఇ, ఎడిఇ స్పందిస్తూ ఇప్పటికే పట్టణంలో పూర్తిస్థాయిలో మెయింటెనెన్స్ పనులు చేశామని, పెరుగుతున్న విద్యుత్ అవసరాలకు తగిన విధంగా యంత్ర సామగ్రిని, సిబ్బందిని సమకూర్చుకున్నామని పండగ వేళ ప్రజలకు అసౌకర్యం కలగకుండా చూస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పల్లి గంగాధర్, శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

మత సామరస్యాన్ని పరిరక్షించాలి

సిపిఎం ఆధ్వర్యాన సమైక్యతా యాత్రలు

ప్రజాశక్తి - సాలూరు

దేశంలో మతసామరస్యం, దేశ సమగ్రత విషయంలో కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం ద్వంద్వ నీతి పాటించకుండా మత సామరస్యాన్ని కాపాడేందుకు కృషి చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎన్‌వై నాయుడు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిపిఎం ఆధ్వర్యంలో జరుగుతున్న సమైక్యత యాత్రలో భాగంగా సాలూరు పట్టణంలో ర్యాలీ జరిగింది. ఈ ర్యాలీని ఉద్దేశించి నాయుడు మాట్లాడుతూ పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రవాదుల దాడుల తర్వాత దేశంలో ప్రజలంతా ఐక్యతను ప్రదర్శించి ఉగ్రవాదానికి వ్యతిరేకంగా నిలిచారని, అమరులైన వారికి అండగా నిలిచి ఉగ్రవాదుల విషయంలో ప్రజలంతా ఏక కంఠంతో నిరసన తెలిపారు. ఈ తరుణంలో దేశాన్ని ఐక్యంగా ఉంచాల్సిన ఎన్‌డిఎ, బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ ప్రజల మధ్య చీలికలు తీసుకువచ్చేలా ప్రయత్నిస్తున్నాయని విమర్శించారు. లౌకికవాద భావాలతో ఎన్టీ రామారావు స్థాపించిన టిడిపి నేడు వాటికి దూరంగా బిజెపి మత ఎజెండాకు వంతపడేలా ఉంటుందని విమర్శించారు. ఉగ్రవాదంపై పోరు విషయంలో, మత విద్వేషాలను బిజెపి రెచ్చగొడుతున్నప్పుడల్లా తోకలా నిలవకుండా మతసామరస్యాన్ని కాపాడేలా నిలబడాలని డిమాండ్ చేశారు. పెహల్గాం ఉగ్రవాద దాడిలో పాల్గొన్న ఒక్కర్నీ నేటి వరకూ పట్టుకోలేదని తెలిపారు. పాకిస్తాన్‌పై ఒత్తిడి తీసుకురావాలని, ప్రపంచంలోనే పాకిస్తాన్ ఒంటరి చేయాలని, దానికోసం పార్లమెంటు సమావేశాలు జరిపి, ప్రత్యేకంగా ఉగ్రవాది దాడి విషయం గురించి చర్చించాలని డిమాండ్ చేశారు. ర్యాలీలో సిపిఎం పట్టణ నాయకులు టి.రాముడు, రవి, రామకృష్ణ, శంకరు, లక్ష్మి పాల్గొన్నారు.

సాలూరులో సమైక్యత యాత్రను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎన్‌వై నాయుడు

బలిజిపేట : స్థానిక ప్రజాసంఘాల కార్యాలయం నుంచి పురవీధుల్లో సమైక్య యాత్ర ర్యాలీ సిపిఎం ఆధ్వర్యాన జరిగింది. అనంతరం బజారు సెంటర్లో జరిగిన కార్యక్రమంలో సిపిఎం నాయకులు రెడ్డి వేణు, యమ్మల మన్మధరావు, గేదెల సత్యనారాయణ మాట్లాడుతూ ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడంలో అన్ని మతాలు, కులాలు, వర్గాల ప్రజలు సమైక్య స్ఫూర్తి తీసుకోవాలని, మతపరమైన విభజనకు తావు లేకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవహరించాలని, వెంటనే ఉగ్రవాదులను అరెస్టు చేసేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బొద్దాన భానుమూర్తి, దన్నాన త్రినాధ, గంట్యాడ బలరాము, వెన్నెల వేణుగోపాలు, వెంకటస్వామి, లక్ష్మి, పాల్గొన్నారు.

బలిజిపేటలో సమైక్యత ర్యాలీ నిర్వహిస్తున్న సిపిఎం నాయకులు

జంఝావతికి జలహారతి

ప్రజాశక్తి - కొమరాడ

మండలంలోని జంఝావతి నదికి జంఝావతి సాధన సమితి శుక్రవారం జలహారతి కార్యక్రమాన్ని నిర్వహించింది. ఆ సమితి అధ్యక్షులు చుక్క భాస్కరరావు, కార్యాచరణ కన్వీనర్ మరిశర్ల మాతీ కృష్ణమూర్తి నాయుడు, గౌరవ సలహాదారు భారతనంద స్వామీజీ ఆధ్వర్యంలో శుక్రవారం జంఝావతి రబ్బర్ డ్యాం వద్ద జల హారతి కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో జంఝావతి ప్రాజెక్టు పూర్తిస్థాయిలో రైతులకు సాగునీరందించేలా దీవించాలని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సమితి అధ్యక్షులు చుక్క భాస్కరరావు మాట్లాడుతూ జంఝావతి ప్రాజెక్టు గత ఐదు దశాబ్దాలుగా ఎన్నికల హామీగానే మిగిలిందన్నారు. ఇంతకాలం ఎన్నికల ముందు హామీ, ఎన్నికల తర్వాత ఒడిశా వివాదం అనే నెపంతో నాయకులు నెట్టుకొచ్చారన్నారు. ఇప్పుడు ఎంపిలో, ఒడిశాలో, కేంద్రంలో బిజెపి కూటమి అనుకూల ప్రభుత్వాలు ఉండడంతో సమస్యను పరిష్కరించాలన్నారు. ఇకపై ఎన్నికల హామీగా జంఝావతిని మిగిల్చే పని కుదరదన్నారు. జంఝా వతి పూర్తయితే ఈ ప్రాంతం వెనుక బాటుతనం పోతుం దని, వలసలు తగ్గు తాయని కార్యా చరణ కన్వీనర్ కృష్ణమూర్తి అన్నారు. జంఝావతిని పూర్తి చేసేంత వరకు జంఝావతి సాధన సమితి పోరాడుతుందని నాయకులంతా స్పష్టం చేశారు. త్వరలో భవిష్యత్ కార్యక్రమాన్ని ప్రకటిస్తామన్నారు. కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్లు సవరపు రామారావు, ఇవి నాయుడు, చీఫ్ అడ్వైజర్ జగన్నాథ్ ప్రసాద్, రాయగురు, ఉపాధ్యక్షులు ఈర్ల సంజీవ నాయుడు, చుక్క చంద్రరావు, వారణాశి శ్రీహరి, మాన్యం రామకష్ణ, మంత్రపూడి వెంకటరమణ, కాంగ్రెస్ నాయకులు బత్తిన మోహన్ రావు, గేదెల రామకృష్ణ, రైతు సంఘం నాయకులు బి.అప్పలనాయుడు, సిపిఐ నాయకులు తోట జీవ, సిపిఐ ఎంఎల్ లిబరేషన్ నాయకులు పి. సంఘం, గిరిజన సంక్షేమ సంఘం నాయకులు పి.రంజిత్‌కుమార్ కార్యాచరణ కో- కన్వీనర్లు జాగరపు ఈశ్వర ప్రసాద్, గవిరెడ్డి సత్య సింహ రఘు చక్రవర్తి, వంగల దాలి నాయుడు, కార్యదర్శులు తీళ్ళ గౌరీ శంకర్రావు, అట్టాడ రవికుమార్, సిహెచ్. వెంకట నాయుడు, ఈశ్వరరావు మాస్టర్ తదితరుల సంఘీభావంతో జంఝావతి నదిలో జలహారతి కార్యక్రమాన్ని నిర్వహించారు.

జంఝావతి నదిలో జలహారతి నిర్వహిస్తున్న సాధనసమితి సభ్యులు

సీతంపేటలో కౌన్సిలింగ్ నిర్వహిస్తున్న పిఒ యశ్వంత్‌కుమార్‌రెడ్డి

సాఫీగా బదిలీల కౌన్సిలింగ్

ప్రజాశక్తి - పార్వతీపురం

ఐటిడిఎ పరిధిలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, సీనియర్ అసిస్టెంట్ల బదిలీల కౌన్సిలింగ్ శుక్రవారం సాఫీగా సాగింది. 20 గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలకు హెచ్‌ఎంల బదిలీలు జరిగాయి. ఆ తర్వాత సీనియర్ అసిస్టెంట్ల బదిలీల ప్రక్రియ కొనసాగింది. యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మురళీమోహన్‌రావు, జిల్లా నాయకులు శ్రీరాములు నాయుడు, కె.జానకీరావు కౌన్సిలింగ్‌కు హాజరయ్యారు. గిరిజన సంక్షేమ శాఖలో ఉపాధ్యాయుల బదిలీలకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం నిర్దిష్టమైన విధానం అమలు చేయలేదని, సర్వీస్ పాయింట్లు కలపలేదని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మురళీమోహన్ రావు తప్పు పట్టారు. ఈ విధానం వల్ల కొంతమందికి నష్టం వాటిల్లిందని చెప్పారు.

సీతంపేట : స్థానిక ఐటిడిఎ పరిధిలో గల ఆశ్రమ ఉన్నత పాఠశాలలు పోస్ట్ మెట్రిక్ హాస్టళ్ల హెచ్‌డబ్ల్యుఒలు, ప్రధానోపాధ్యాయులు, స్కూల్ అసిస్టెంట్ల బదిలీల కౌన్సిలింగ్ పిఒ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. 92 మందికి బదిలీలు కౌన్సిలింగ్ నిర్వహించారు. వీటిలో ప్రధానోపాధ్యాయులు 5, స్కూల్ అసిస్టెంట్లు తెలుగు 12, హిందీ 14, ఇంగ్లీష్ 12, గణితం 10, ఫిజికల్ సైన్స్ 8, బయోసైన్స్ 9, సోషల్ 6, ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్స్ 5, ఎల్‌ఎఫ్‌ఎల్ హెచ్‌ఎం 5, పిఇటిడబ్ల్యు 2, హెచ్ డబ్ల్యుఒ 4కు ప్రశాంతంగా కౌన్సిలింగ్ నిర్వహించారు. కార్యక్రమంలో ఎపిఒ చినబాబు, డిడి అన్నదొర, ఎటిడబ్ల్యుఒ మంగవేణి, ఎఎంఒ కోటిబాబు, హెచ్‌ఎం సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పలుచోట్ల భారీ వర్షాలు

ప్రజాశక్తి - వీరఘట్టం

జిల్లాలోని పలు మండలాల్లో శుక్రవారం భారీ వర్షాలు కురిశాయి. ఇందులో భాగంగా వీరఘట్టం మండలంలోని శుక్రవారం వర్షం కురిసింది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు తీవ్రమైన ఎండ ఉన్నప్పటికీ ఒకసారిగా వాతావరణంలో మార్పు వచ్చి ఆకాశము నల్ల మబ్బుల ఏర్పడడంతో గాలితో పాటు వర్షం కురిసింది.

గుమ్మలక్ష్మీపురంలో కురుస్తున్న వర్షం

పాలకొండ : పాలకొండలో కుండపోతు వర్షం కురిసింది. సుమారు గంటన్నర పాటు ఎడతెరిపి లేకుండా వర్షం కురవడంతో జనజీవనం స్తంభించింది. రోడ్లన్నీ జలమయమయ్యాయి.

గుమ్మలక్ష్మీపురం : గుమ్మలక్ష్మీపురంలో శుక్రవారం మోస్తరు వర్షం కురిసింది. సుమారు గంట పాటు కురిసిన వర్షంతో ప్రధాన రహదారులు బురదమయమయ్యాయి. వరుసగా కురుస్తున్న వర్షాలతో వాతావరణం చల్లబడింది. గుమ్మలక్ష్మీపురం, ఎల్విన్ పేట, లక్కగూడ, ఎస్‌కె పాడు తదితర ప్రాంతాల్లో వర్షం పడింది. ఈ ఏడాది ఖరీఫ్ పనులు ముందస్తుగా ప్రారంభించడానికి వీలుంటుందాని రైతులు భావిస్తున్నారు.

కార్మికవర్గ కష్టాలు తీర్చేది సిఐటియునే

ప్రజాశక్తి - బలిజిపేట

దేశంలో కార్మిక వర్గం కష్టాలు తీర్చేది సిఐటియు జెండానేనని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వై.మన్మధరావు అన్నారు. సిఐటియు ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో శుక్రవారం సిఐటియు జెండాను ఎగురవేశారు. సిఐటియు మండల సమన్వయ కన్వీనర్ యు.లక్ష్మి ఆధ్వర్యాన జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ దేశంలోని అన్ని వర్గాల కార్మికుల సమస్యలపై అలుపు ఎరగని పోరాటం చేసేది సిఐటియేనన్నారు. 1970లో సిఐటియు ఆవిర్భవించిందని, నాటి నుంచి నేటి వరకు అవిశ్రాంత పోరాటాలు చేస్తూ, కార్మిక వర్గానికి వెన్నుదన్నుగా ఉంటూ పదుల సంఖ్యలో కార్మిక చట్టాలు సాధించుకొని కార్మికులకు రక్షణ కవచంగా సిఐటియు నిలిచిందన్నారు. పెట్టుబడిదారీ వ్యవస్థకు వ్యతిరేకంగా కార్మికులకు కనీస వేతనం, హక్కులు, వాటి రక్షణ కోసం, నిత్యం కార్మికులతో మమేకమవుతూ, ఐక్యం చేస్తూ, పోరాటాలు నిర్వహిస్తుందని ఆయన తెలిపారు. మే నెల అంటేనే కార్మికుల నెలగా కార్మికులంతా గుర్తుపెట్టుకోవాలన్నారు. మే 1న ఎర్రజెండా పుడితే దేశంలో 30న సిఐటియు ఆవిర్భవించిందన్నారు. కార్మికుల్లో కుల, మత ప్రాంత బేధాలు లేకుండా దేశ సమైక్యత నింపుతూ, కార్మిక వర్గ రాజ్య స్థాపనే లక్ష్యంగా కార్మిక వర్గ కష్టాల విముక్తి ధ్యేయంగా సిఐటియు పోరాటాలు చేస్తుందని అన్నారు. బిజెపి ప్రభుత్వం 44 లేబర్ చట్టాలను రద్దు చేసి, నాలుగు లేబర్ కోడ్‌లుగా తీసుకొచ్చిందని, ఇవి కార్మికులకు ఉరితాడుగా మారనున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ జులై 9న దేశవ్యాప్తంగా తలపెట్టి సమ్మెను కార్మికులు జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆటో, రిక్షా, రైస్ మిల్లు, ఆశా యూనియన్ నాయకులు, కార్మికులు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు రెడ్డి వేణు, గేదెల సత్యనారాయణ సాంబమూర్తి, భాస్కరరావు, అప్పన్న తదితరులు పాల్గొన్నారు.

పార్వతీపురం టౌన్ : సిఐటియు ఆవిర్భావం దినోత్సవం సందర్భంగా స్థానిక పాత బస్టాండ్ ఆవరణలో సిఐటియు జెండా ఆవిష్కరించి, వివిధ రంగాల కార్మికులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి బివి రమణ, జిల్లా కోశాధికారి గొర్లి వెంకటరమణ మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆలభిస్తున్న విధానాల వల్ల ఉద్యోగ భద్రత, కనీస వేతనాలు లభించక కార్మిక వర్గం రోజురోజుకూ తీవ్రమైన ఇబ్బందులకు గురవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో సంఘాలు ఏర్పాటు చేసుకొని పోరాటమే తప్ప వేరే మార్గం కార్మిక వర్గానికి లేదని అన్నారు. కార్మిక వర్గం ఎదుర్కొంటున్న తమ సమస్యలు పరిష్కారానికి భవిష్యత్ పోరాటాలకు కార్మిక వర్గం సిద్ధం కావాలని, అందులో భాగంగా జూలై 9న జరుగు దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వివిధ రంగాల కార్మిక నాయకులు పాకల సన్యాసిరావు, పల్లి గంగాధర్, చీపురుపల్లి సింహాచలం, నాగవంశం శంకర్రావు, మామిడి శివ, బంగారు రవి, భానుమూర్తి, బాబురావు తదితరులు పాల్గొన్నారు.

పలుచోట్ల ఘనంగా ఆవిర్భావ దినోత్సవం

పాలకొండ : కార్మికుల సమస్యలపై పోరాటం చేసి వారి కష్టాలు తీర్చేది సిఐటియు జెండేయేనని సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాలా రమణారావు అన్నారు. సిఐటియు ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పాలకొండలో సిఐటియు జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగు లేబర్ కోడ్‌ల రద్దు, 44 లేబర్ చట్టాల అమలుకై జులై 9న దేశవ్యాప్తంగా కార్మికుల సమ్మె జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం కార్మికులందరికీ సిఐటియు ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. సిఐటియు మండల కార్యదర్శి కాద రాము అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎ.లక్ష్మణరావు, కె.శ్రీనివాసు, ఎం.రమణ, ఆటో కార్మికులు పాల్గొన్నారు.

బలిజిపేటలో సిఐటియు జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

పాచిపెంట : స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో శ్రామిక మహిళా నాయకులు కె.పార్వతీదేవి ఆధ్వర్యంలో సిఐటియు జెండాను ఆవిష్కరణ చేశారు. అనంతరం సిఐటియు నాయకులు కోరాడ ఈశ్వరరావు, శ్రామిక మహిళ నాయకులు పార్వతీదేవి మాట్లాడుతూ జులై 9న తలపెట్టిన దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో ఆటో కార్మిక సంఘం నాయకులు పిన్నింటి రమేష్, వసంతరావు, రైతు సంఘం నాయకులు బోను గౌరినాయుడు, హమాలీ కార్మిక సంఘం నాయకులు లంక గోవింద తదితరులు పాల్గొన్నారు.

పార్వతీపురం, పాచిపెంటలో సిఐటియు జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

ఐటిడిఎలో టెండర్లు

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక ఐటిడిఎ పరిధిలోని విడివికె కేంద్రాలకు యంత్ర పరికరాలను సరఫరా చేసేందుకు శుక్రవారం ఐటిడిఎ పిఒ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి టెండర్లను నిర్వహించారు. ఈ సందర్భంగా పిఒ మాట్లాడుతూ టెండర్ దక్కించుకున్న వారు సకాలంలో యంత్ర పరికరాలను వీడీవీకే కేంద్రాలకు సరఫరా చేయాలన్నారు. ఈ టెండర్ కార్యక్రమంలో ఏడుగురు టెండర్‌దారులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎపిఒ జి.చినబాబు, డిడి అన్నదొర, పిహెచ్‌ఒ గణేష్, వెలుగు డిపిఎం రవి, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పని భారంతో స్టాఫ్‌నర్సులు సతమతం

ప్రజాశక్తి - భామిని

స్థానిక ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రంలో ముగ్గురు స్టాఫ్‌నర్సులకు గానూ ఇద్దరే పనిచేయడంతో పనిభారంతో వారు తీవ్రఇబ్బందులు పడుతున్నారు. ఈ పిహెచ్‌సి పరిధిలో అనేక గిరిజన గ్రామాల ప్రజలకు వైద్య సదుపాయాలు అందించాల్సి ఉంది. ప్రతి రోజూ అవుట్ పేషెంట్లు 70 నుంచి 80 మంది వస్తుంటారు. దీంతో ఉన్న ఇద్దరు స్టాఫ్‌నర్సులు పనిచేస్తున్నారు. ఒకరు సెలవు పెడితే మరొకరు 12 గంటల పాటు విధులు నిర్వహించాల్సిన పరిస్థితి ఉంది.ముగ్గురు స్టాఫ్‌నర్స్ ఇక్కడ పనిచేస్తూ జీతం తీసుకుంటున్నారు. అయితే మరో స్టాఫ్‌నర్సు వేరే చోట విధులు నిర్వహిస్తున్న పరిస్థితి. ఈ అంశంపై స్థానిక పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ పి.సోయల్ వద్ద ప్రస్తావించగా, ప్రస్తుతం భామిని హాస్పిటల్‌లో మూడో స్టాఫ్ నర్స్ ఖాళీ చూపించడం లేదని, మూడో స్టాఫ్ నర్సు ఇక్కడ జీతం తీసుకుంటూ అనకా పల్లి వద్ద ఎక్కడో పిహెచ్‌సిలో విధులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కనీసం డెప్యూటేషన్‌పైనైనా ఒక స్టాఫ్ నర్స్ వేస్తే విధులకు ఆటంకం ఉండదని, అదనపు పని భారం తగ్గుతుందని తెలిపారు.

డిఐఇఒకు అభినందనలు

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

డిఐఇఒగా బాధ్యతలు చేపట్టిన వై.నాగేశ్వరరావుకు శుక్రవారం ప్రభుత్వ జూనియర్ లెక్చరర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆ సంఘ నాయకులు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లెక్చరర్ల విధుల నిర్వహణకు సానుకూలంగా ఉంటూ, అందరి సహకారంతో విధులు నిర్వహిస్తానని తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులసంఘ నాయకులు తెర్లి రవికుమార్, ఎస్.శ్రీనివాసరావు, ఆకుల రాజు, భాస్కరరావు, సత్యానంద్ శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మిగులు సీట్లకు కౌన్సిలింగ్ నిర్వహిస్తున్న ప్రిన్సిపల్

ఇంటర్ మిగులు సీట్ల భర్తీకి కౌన్సిలింగ్

ప్రజాశక్తి - భామిని

స్థాని ఏకలవ్య మోడల్ రెసిడెన్సియల్ స్కూల్‌లో ఇంటర్ ఫస్ట్ ఇయర్ ఎంపిసి, బైపిసి, హెచ్ఇసి గ్రూప్‌లో ప్రమోట్ చేయగా, ఈ మూడు గ్రూప్‌ల్లో మిగిలిన 38 సీట్లు భర్తీకి శుక్రవారం ఇఎంఆర్ఎస్ ప్రిన్సిపల్ గుండెపల్లి లక్ష్మీదేవి ఆధ్వర్యంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ 38 సీట్లుకు గానూ 66 మంది దరఖాస్తు చేసుకున్నట్టు ప్రిన్సిపల్ తెలిపారు. టెన్త్ క్లాస్ మార్కుల మెరిట్ ఆధారంగా అర్హులైన విద్యార్థులకు సీట్లు కేటాయించామని, 38 సీట్లును విద్యార్థులకు కేటాయించినట్టు ప్రిన్సిపల్ తెలిపారు. ఇంటర్ విద్యార్థులకు ఉన్నతాధికారుల ఆదేశాలనుసరించి పాఠశాల ప్రారంభం అనంతరం ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులకు తరగతిలో ప్రారంభిస్తామని ప్రిన్సిపల్ తెలిపారు. హిందీ ఉపాధ్యాయుల భాస్కర్, ఏకలవ్య సిబ్బంది ఉన్నారు.

రెగ్యులర్ డిఇఒను నియమించాలని 2న ధర్నా

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

పార్వతీపురం మన్యం జిల్లాకు రెగ్యులర్ డిఇఒను నియమించాలని కోరుతూ జూన్ 2న కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్నామని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్ కుమార్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. పలు గిరిజన, విద్యార్థి, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ధర్నా జరుగుతుందని వివరించారు. తక్షణమే జిల్లాకు రెగ్యులర్ డిఇఒను నియామకం చేయండని రాష్ట్ర ప్రభుత్వాన్ని రంజిత్‌కుమార్ డిమాండ్ చేశారు. జిల్లా ఇన్‌ఛార్జ్ డిఇఒ నియామకంలో జిల్లా ఉన్నతాధికారుల తీరు అభ్యంతరకరంగా ఉందని రంజిత్‌కుమార్ అన్నారు.

ఎరువులు సిద్ధం

ప్రజాశక్తి - గరుగుబిల్లి

ఈ ఖరీఫ్ సీజన్‌కు ఎరువులు సిద్ధంగా ఉన్నాయని మండల వ్యవసాయాధికారి ఆర్.విజయభారతి తెలిపారు. మండలంలో పరిధిలో 16వేల ఎకరాలు ఈ ఖరీఫ్‌కు సాగవుతుందన్నారు. రైతుల అవసరాల మేరకు 300 మెట్రిక్ టన్నుల యూరియా, 200 మెట్రిక్ టన్నుల డిఎపి, 300 మెట్రిక్ టన్నుల కాంప్లెక్స్ ఎరువులను మంజూరు చేస్తూ రైతుసేవ కేంద్రాల్లో నిల్వ ఉన్నాయని తెలిపారు. అలాగే ప్రస్తుతం మండలంలోని అన్ని ఎరువులు అందుబాటులో ఉన్నాయని, రైతులు ఎటువంటి ఆందోళనకు పడాల్సిన అవసరం లేదని తెలిపారు. అలాగే ఎవరైనా అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తున్నట్టు సమాచారం అందితే తక్షణమే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పట్టణంలో కొత్త స్తంభాలు వేస్తున్న సిబ్బంది

యుద్ధ ప్రాతిపదికన విద్యుత్తు పనులు

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

పార్వతీపురంలో ఇప్పలపోలమ్మ, ఎర్ర కంచమ్మ గ్రామ దేవతల అమ్మవారుల పండగ ఉత్సవాలు జూన్ 1,2,3 తేదీల్లో జరుగుతున్న నేపథ్యంలో పట్టణంలో విద్యుత్ సరఫరాలో ఎలాంటి అవాంతరాలు ఎదురవ్వకుండా ఉండేందుకు విద్యుత్‌శాఖ అధికారులు సిబ్బందితో గత మూడు రోజుల నుంచి విద్యుత్ సరఫరా నిర్వహణ పనులను చేపట్టారు. ఈ నిర్మాణ పనుల కారణంగా ఏర్పడిన విద్యుత్ కోతలతో స్థానిక ప్రజలతో పాటు విద్యుత్తు సాయంతో పనులు చేసే కార్మికులు ఇబ్బందులు పడుతూ అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల సాలూరులో సాక్ష్యాత్తు రాష్ట్ర గిరిజన శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి నియోజకవర్గంలో జరిగిన సాలూరు అమ్మవారి పండగ ఉత్సవాల్లో ఏర్పడిన విద్యుత్తు అంతరాయాన్ని జిల్లా కేంద్రంలో పునరావృతం కాకుండా ఉండేందుకు విద్యుత్ శాఖ అధికారులు, అమ్మవారి పండగ సందర్భంగా ఇప్పల పోలమ్మ ఎర్రకంచమ్మ అమ్మవార్ల 2 సిరిమానులు తిరిగిన ప్రాంతాలతో పాటు పట్టణంలో విద్యుత్ సరఫరాలో ఎలాంటి అవాంతరాలు కలగకుండా ఉండేందుకు ముందస్తుగా యుద్ధ ప్రాతిపదికన విద్యుత్ లోపాలు ఏర్పడకుండా మరమ్మతు పనులు చేపట్టడం జరుగుతోంది. ఈ పనుల కారణంగా పండగ సందర్భంలో విద్యుత్ సరఫరాపై ఎలాంటి పరిస్థితులు కలుగుతాయో చూడాలి మరి.

జెడ్‌పి హైస్కూళ్లకు రెగ్యులర్ హెచ్ఎంలు

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని బూర్జ, జగ్గనాయుడుపేట, నిడగల్లు, మరిపివలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలకు ప్రధానోపాధ్యాయులను రెగ్యులర్ ప్రధానోపాధ్యాయులుగా నియమిస్తున్నట్లు ఎంఇఒలు జి.సూరిదేవుడు, ఎం.వెంకటరమణ తెలిపారు. నిడగల్లు హెచ్‌ఎంగా ఎస్ఎల్ పాత్రుడు, జగ్గనాయుడుపేట హెచ్ఎంగా కాగాన వెంకటనాయుడు మరిపివలస హెచ్‌ఎంగా విజయలక్ష్మి, బూర్జి హెచ్‌ఎంగా బి.సాంబశివరావు నిమమితులయ్యారు. కొత్తగా వచ్చిన ప్రధానోపాధ్యాయుల్లో ఇద్దరు బదిలీపై రాగా, మిగిలిన ఇద్దర ఉద్యోగోన్నతిపై వస్తున్నారని తెలిపారు.

కిచ్చాడలో తాగునీటి సమస్య పరిష్కారం

'ప్రజాశక్తి' వార్తకు స్పందన

ప్రజాశక్తి - కురుపాం

మండలంలోని కిచ్చాడలో మరమ్మతులకు గురైన బోరుకు మరమ్మతులు చేపట్టి ప్రజలకు అధికారులు తాగునీరిందించారు. ఈనెల 28న కిచ్చాడలో తాగునీటి సమస్య అన్న వార్తకు అధికారులు స్పందించారు. ఈమేరకు పంచాయతీ కార్యదర్శి శుక్రవారం మరమ్మతులకు గురైన బోరును బాగుచేసి ప్రజలకు తాగునీరందించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు 'ప్రజాశక్తి'కి ధన్యవాదాలు తెలిపారు.

చెత్త వేసి ప్రజలను రోగాలకు గురిచేయొద్దు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ఆసుపత్రి పరిసర ప్రాంతాల్లో వ్యాపారులు చెత్తను వేసి రోగులకు, ప్రజలకు ఇబ్బందులు కలిగించొద్దని, రోగాల బారిన పడేలా చేయొద్దని సర్పంచి బి.గౌరీశంకర్రావు హెచ్చరించారు. ఆసుపత్రి ఆవరణంలో చెత్త ఉండడాన్ని చూసి వ్యాపారులపై మండిపడ్డారు. ఆసుపత్రి ఆవరణంలో చెత్త వేయడమేమిటని ప్రశ్నించారు. వ్యాపారులచే దగ్గరుండి చెత్తను తొలగించారు. వర్షాకాలం దృష్ట్యా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేలా చూడాలని, బహిరంగ ప్రదేశాల్లో ఎవరైనా చెత్త వేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఆసుపత్రి ఆవరణలో చెత్తను తొలగిస్తున్న సర్పంచ్

'తోటపల్లి' వద్ద 1500 మందితో యోగా

ప్రజాశక్తి - గరుగుబిల్లి

పర్యాటక ప్రదేశాల్లో నిర్వహించే యోగా కార్యక్రమం తోటపల్లి రిజర్వాయర్ వద్ద ఐటిడిఎ పార్కు వద్ద యోగాంధ్ర కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. సుమారు 1500 మందికి పైచిలుకు ప్రజలు పాల్గొని యోగాలో సాధన చేస్తూ మేము సైతం యోగాంధ్రా కార్యక్రమంలో పెద్ద ఎత్తున భాగస్వామ్యం అవుతున్నామని చాటి చెప్పారు. కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ స్వయంగా సూర్య నమస్కారాలను చేస్తూ యోగ విశిష్టతను చెప్పారు. యోగా శిక్షకులు మోహన్ కార్యక్రమాన్ని సమన్వయం చేస్తూ వివిధ యోగాసనాలను పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ డబ్బులు కంటే ఆరోగ్యం ముఖ్యమన్నారు. యోగాంధ్ర కార్యక్రమం జిల్లాలో విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని తెలిపారు. 3250 మంది యోగా శిక్షకులు నమోదయ్యారని, గ్రామ, మండల స్థాయిలో శిక్షణా కార్యక్రమాలు జరుగుతున్నాయని తెలిపారు. ఐటిడిఎ ప్రాజెక్టు పిఒ అశుతోష్ శ్రీవాస్తవ మాట్లాడుతూ యోగా అలవాటుగా మారాలన్నారు. యోగా ద్వారా వ్యక్తిత్వ వికాసం పెరుగుతుందని, ప్రతి కుటుంబంలో ఇది భాగం కావాలని తద్వారా సమాజంలో బలపడాలని ఆయన ఆకాంక్షించారు. 25 ఏళ్లుగా యోగ సాధన చేస్తున్న మరడాన తవిటి నాయుడు ఓపెన్ హార్ట్ సర్జరీ చేయించుకున్న తర్వాత కూడా యోగ సాధన చేస్తున్న ద్వారపురెడ్డి సత్యనారాయణ, రాష్ట్ర స్థాయి యోగ పోటీల్లో పాల్గొన్న సాహితీ తదితర విద్యార్థులు, యోగ సంస్థల సభ్యులు పాల్గొన్నారు. కార్యక్రమంలో పలువురు జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

యోగాంధ్ర లో వైద్యశాఖ

పార్వతీపురం : యోగాంధ్ర మాస వేడుకల కార్యక్రమాల్లో వైద్య ఆరోగ్య శాఖ పాల్గొంటుందని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఎస్.భాస్కరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. యోగాంధ్ర మాస వేడుకల కార్యక్రమాలు శనివారం స్థానిక లయన్స్ క్లబ్‌లోను, సాలూరులో ప్రభుత్వ డిగ్రీ కళాశాల దగ్గర ఇండోర్ స్టేడియంలో, పాలకొండలో రామ కళామందిర్ థియేటర్ దగ్గర గాయత్రీ కళ్యాణ మండపంలో నిర్వహిస్తున్నట్లు ఆయన చెప్పారు. శనివారం ఉదయం 7 నుండి 9 గంటల వరకు జరుగుతాయని అన్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది పెద్ద ఎత్తున ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

భామిని : బత్తిలి పిహెచ్‌సి పరిధిలోని మనుమకొండలో డా. దామోదర్ ఆధ్వర్యంలో యోగంధ్రా నిర్వహించారు. అనంతరం స్థానిక సర్పంచ్ ఎన్. కేశవ, వైద్య సిబ్బంది పలు యోగసనాలు వేసి చూపిస్తూ, పిల్లలచే వేయించారు.

గుమ్మలక్ష్మీపురం : యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా గుమ్మలక్ష్మీపురం బిఎస్ఆర్ కళ్యాణ మండపంలో అన్ని రంగాల అధికారులు, ఉద్యోగులు, ప్రజలు, మహిళలు, యువత యోగాసనాలు వేశారు. మానవ ఆరోగ్య ప్రధాయిని యోగా అని అన్నారు. ప్రాణాయామం ఆసనం వల్ల అనేక వ్యాధులు నయమవుతాయని, కావున ఈ కార్యక్రమంలో ప్రజలంతా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపిడిఒ సాల్మన్‌రాజు, తహశీల్దార్ శేఖర్, ఎంఇఒ చంద్రశేఖర్ తదితరులు ఉన్నారు.

వీరఘట్టంలో యోగా చేస్తున్న మండలపరిషత్, వైద్య, ఐసిడిఎస్ సిబ్బంది

యోగా చేస్తున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

వీరఘట్టం : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో యోగా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ బి.వెంకటరమణ, ఎఒ డి.వెంకటరమణ, వైద్యాధికారి బి.ప్రదీప్ కుమార్, విద్య, గృహ, ఉపాధి శాఖల అధికారులు డి.గౌర్నాయుడు, వి.వినోద్‌కుమార్, జి.సత్యంనాయుడుతో పాటు సిహెచ్ఒలు, అంగన్వాడీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

సీతానగరం: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో యోగాంధ్రపై శిక్షణ నిర్వహించారు. ఎంపిడిఒ ఎంఎల్ఎన్ ప్రసాద్, ఇఒపిఆర్‌డి వర్మ, వైద్యాధికారి పి.ఉషారాణి, పలు మండల స్థాయి అధికారులు, వైద్య, సచివాలయ, హై స్కూల్ సిబ్బంది పాల్గొన్నారు.

కురుపాం : యోగాను అలవాటు చేసుకొని ప్రజలంతా ఆరోగ్యంగా ఉండాలని ఎంపిడిఒ జె. ఉమామహేశ్వరి సూచించారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయం మీటింగ్ హాల్లో యోగాంధ్ర నిర్వహించారు. అనంతరం ఎంపిడిఒ కార్యాలయం నుంచి ప్రధాన రహదారి మీదగా ఎంఇఒ కార్యాలయం వరకు యోగేంద్రపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శులు, ఐసిడిఎస్, వెలుగు, ఉపాధి హామీ సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పెండింగ్ కేసులను త్వరితగతిన పూర్తి చేయాలి

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

క్షేత్రస్థాయిలో ముందస్తు సమాచార వ్యవస్థ పటిష్టం చేసుకుని ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో పెండింగ్ కేసులను త్వరితగతిన పూర్తి చేయాలని ఎస్పీ ఎస్‌వి మాధవ్ రెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా పోలీస్ అధికారులతో పోలీస్ కాన్ఫరెన్సు హాల్‌లో నెలవారీ నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. శాంతిభద్రతల పరిరక్షణ చర్యలు, గ్రేవ్, నాన్ గ్రేవ్ కేసుల పురోగతి, ఎస్సీ, ఎస్టీ కేసులు, ప్రయారిటి పిటి కేసుల స్థితిగతులు, ఎన్ డి పి ఎస్ కేసులు, మిస్సింగ్ కేసులు, సైబర్ నేరాలు, నాన్ బైలబుల్ వారెంట్లు, ఇతర కేసులను జిల్లా పోలీస్ అధికారుల ద్వారా సమాచారాన్ని సేకరించి తగిన సూచనలు, సలహాలు, మెలకువలను తెలిపారు. పోలీసు స్టేషన్లలో నమోదయ్యే కేసుల వివరాలను ప్రతీ అంశాన్ని క్షుణ్ణంగా సిసిటిఎంఎస్‌లో ఎప్పటికప్పుడు పొందుపర్చాలన్నారు. ఈ నేర సమీక్ష సమావేశంలో ప్రతి పోలీస్ స్టేషన్కు సంభందించిన అధికారులను వారి కేసుల వివరాలు సీసీటీఎన్ఎస్‌లో నమోదు చేసారో లేదోనని ఆరా తీశారు. ఎఫ్ ఎస్ ఎల్ రిపోర్ట్‌ల పెండింగ్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. రాత్రి గస్తీ సమయంలో వాహన తనిఖీలుచ ఏయాలని, రోడ్ ప్రమాదాల నివారణకు పేస్ వాష్ కార్యక్రమం నిర్వహించాలన్నారు. శక్తి యాప్ రిజిస్ట్రేషన్ ఎక్కువగా నమోదు కావాలన్నారు. అంతర్ రాష్ట్ర చెక్ పోస్టులైన పాచిపెంట, కొమరాడ, గుమ్మలక్ష్మీపురంలో సీసీ కెమెరాలతో గట్టి నిఘా ఉంచాలని, వాహన తనికీలు నిర్వహించాలని, సంబంధిత అధికారులను ఆదేశించారు. ర్యాగింగ్, మహిళలపై జరిగే నేరాలు, రహదారి భద్రత , సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమాల ద్వారా ప్రజలకు తెలియజేయాలన్నారు. ఇన్వెస్టిగేషన్‌లో అలసత్వం ఉండకూడదని హెచ్చరించారు. గంజాయి సరఫరా, అమ్మకం, తాగడం సంబంధించిన సమాచారాన్ని సేకరించాలని, రహదారులు గుండా అక్రమంగా తరలిస్తున్న గంజాయిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. నాటు సారా కాచే పాత నేరస్థులపై నిఘా ఉంచాలని, విజబుల్ పోలీసింగ్, పెట్రోలింగ్ ముమ్మరం చేయాలని, ఎన్ఫోర్స్మెంట్ వర్క్ పై దష్టి సారించాలని, బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించకుండా చర్యలు తీసుకోవాలని, దొంగతనల నివారణ కొరకు పాత నేరస్తుల కదలికలపై నిఘా ఉంచాలని సూచించారు. రైల్వే పోలీస్ల తో సమన్వయం చేసుకొంటూ లోకల్ పోలీస్ లు, స్పెషల్ పార్టీ సిబ్బంది ట్రైన్ ల లో ఎటువంటి అక్రమ రవాణా జరగకుండా తనికీలు చేయాలన్నారు. అదే విధంగా ఎక్సైజ్ శాఖ తో కలిసి నాటుసారా తయారి, రవాణా ను అడ్డుకట్ట వేయాలన్నారు. ఈ సందర్భంగా మెడికల్ ఆఫీసర్ వినోద్ పొగాకు వల్ల కలిగే అనర్థాలను సిఒటిపిఎ చట్టం గురించి అధికారులు వివరించారు. అనంతరం జిల్లా ఎస్పీ చేతుల మీదుగా పొగాకు వలన కలిగే నష్టాలపై అవగాహన కల్పించే గోడ పత్రికలను అవిష్కరింపజేశారు. విధి నిర్వహణలో ప్రత్యేక ప్రతిభ కనబర్చిన అధికారులకు, సిబ్బందికి ప్రశంసా పత్రాలను ఎస్‌పి అందజేశారు. సమావేశంలో పాలకొండ డిఎస్పీ ఎం.రాంబాబు, ఎస్బి సిఐ రంగనాథం, డిసిఆర్‌బి సిఐ ఆదాం, సోషల్ మీడియా,సైబర్ సెల్ సిఐ శ్రీనివాస రావు, సిసిఎస్ సిఐ అప్పారావు, ఎఆర్ ఆర్ఐలు రాంబాబు, నాయుడు, జిల్లా సిఐలు ,ఎస్ఐలు, జిఆర్పి ఎస్సై, ఎక్సైజ్ సిఐ, ఐరాడ్ శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

పొగాకు వల్లే కలిగే నష్టాలను వివరిస్తూ పోస్టర్ విడుదల చేస్తున్న ఎస్‌పి మాధవరెడ్డి

9593 మందికి పింఛన్లు పంపిణీ

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని 24 సచివాలయాల పరిధిలో వృద్ధాప్య, వితంతు, ఒంటరి మహిళ, దివ్యాంగులు, చేనేత, మత్స్యకార, డప్పు కళాకారులు, చర్మకారులు, తదితర రకాలైన 9593 మందికి ఈనెల 31న పింఛన్లు పంపిణీ చేయనున్నట్లు ఎంపిడిఒ బి.వెంకటరమణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకు సంబంధించి 165 మంది సిబ్బంది ఇంటింటికి వచ్చి పింఛన్ పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఎవరూ కార్యాలయాల చుట్టూ తిరగొద్దని, మీ ఇంటి వద్దకే వచ్చి పింఛన్ ఇస్తారని, ఈ అంశాన్ని పింఛనుదారులు గ్రహించాలని అన్నారు.

పాఠశాలకు పూర్వ విద్యార్థి వితరణ

ప్రజాశక్తి - కురుపాం

స్థానిక జిల్లా పరిషత్‌ఉన్నత పాఠశాలలో 1983-84లో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థి కొత్తకోట మురళీకృష్ణ శుక్రవారం ప్రధానోపాధ్యాయులు తోట శంకరరావుకు పాఠశాలకు ఉపయోగపడే బీరువా, తదితర వస్తువులను వితరణగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను చదువుకున్న పాఠశాలకు అవసరమైన మెటీరియల్ వితరణగా అందజేయడం సంతోషంగా ఉందని, రానున్న రోజుల్లో తనకు తోచిన సహాయం పాఠశాల అభివృద్ధికి అందించిడానికి కృషి చేస్తానని అన్నారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థికి పాఠశాల సిబ్బంది అభినందించారు.

పాఠశాలకు బీరువా అందజేస్తున్న మురళీకృష్ణ

జీపు జాతాను జయప్రదం చేయండి

ఆదివాసీ గిరిజన సంఘం పిలుపు

ప్రజాశక్తి - మక్కువ

షెడ్యూల్ ఏరియాలో 100శాతం ఉద్యోగాలు ఆదివాసీలకు ఇవ్వాలని, గిరిజన ప్రాంతాల్లో నిరుద్యోగులందరికీ ఉపాధి అవకాశాలు కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన డీఎస్సీలో ఏజెన్సీ టీచర్ పోస్టులు మినహాయించి గిరిజన ప్రాంత ప్రత్యేక డీఎస్సీ ప్రకటించాలని డిమాండ్ చేస్తూ ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో జీపుజాత జరుగుతుందని ఆదివాసీ గిరిజన సంఘం తెలిపింది. జీపు జాతా వివరాలను మక్కువ మండలంలో ఎర్రసామంతవలస, మక్కువలో ప్రచారంలో భాగంగా ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు విడుదల చేశారు. జూన్ 1న 11 గంటలకు వైఎస్ వలసకు జీపు యాత్ర వస్తుందని, అనంతరం సాలూరు, పాచిపెంట మండలాల గుండా అరకు చేరుకుంటుందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలకు ముందు గిరిజన ప్రాంతాల్లో ఇచ్చిన హామీలన్నీ అమలు చేసి నిరుద్యోగులు సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. జాతా కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు సురేంద్ర, అప్పలనరసయ్య, మండంగి రమణ తదితరులు పాల్గొంటారని తెలిపారు. మక్కువ మండలంలో ఆదివాసీ ప్రాంతాల్లో ఉండే నిరుద్యోగులంతా పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రచారానికి సంబంధించిన కరపత్రాన్ని నాయకుడు విడుదల చేశారు. ఆదివాసీ గిరిజన సంఘం మండల నాయకులు సీదరపు సూరయ్య, కర్ర జయన్న, అరలప్ప, సీదరపు విజయ్, చౌడేపల్లి రాజు, ప్రజా సంఘాల నాయకులు ఎన్‌వై నాయుడు, జి.కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బస్సు సర్వీసును పునరుద్ధరించాలి

తహశీల్దార్ కార్యాలయం వద్ద సిపిఎం ధర్నా

ప్రజాశక్తి - బలిజిపేట

మండలంలోని నారాయణపురం బ్రిడ్జిపై నుంచి పార్వతీపర్రం-గౌరీపురం బస్సును పునరుద్ధరించి బలిజిపేట వరకు నడపాలని, నారాయణపురం వద్ద బైపాస్ రోడ్డు నిర్మించాలని డిమాండ్ చేస్తూ సిపిఎం ఆధ్వర్యాన శుక్రవారం స్థానిక తహశీల్దార్ కాళ్యాలయం వద్ద ధర్నా జరిగింది. ఈ ధర్నానుద్దేశించి సిపిఎం నాయకులు యమ్మల మన్మధరావు, గేదెల సత్యనారాయణ, బొద్దాన భానుమూర్తి మాట్లాడుతూ ప్రభుత్వం కోట్లాది రూపాయలు ఖర్చు చేసి నారాయణ పురం వద్ద సువర్ణముఖీ నదిపై బిడ్జి నిర్మించిందన్నారు. ఈ బ్రిడ్జి నిర్మాణం పూర్తయిన రెండేళ్లయినా ప్రారంభానికి నోచుకోలేదన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వమైనా బ్రిడ్జిని ప్రారంభించి పార్వతీపురం నుంచి బలిజిపేట వరకు గౌరీపురం మీదు బస్సు సర్వీసును వెంటనే పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. నారాయణపురంలో ట్రాపిక్ ఉన్నందున నీలకంఠ ఆలయం వద్ద నుంచి అంకళాం పిల్లకాలువ మీదుగా బైపాస్ రోడ్డు ప్రభుత్వం నిరించి ప్రజలకు రహదారి సౌకర్యం ఏర్పాటు చేయాలని కోరారు. ఆర్‌టిసి, పంచాయతీరాజ్, జిల్లాపరిషత్ అధికారులు కలుగజేసుకోని బస్సు నడపాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు రెడ్డి వేణు, వెన్నెల వేణుగోపాలు, దన్నాన త్రినాధ, పి.వెంకటస్వామి, గంట్యాడ బలరామనాయుడు లక్ష్మమ్మ, అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

తహశీల్దార్ కార్యాలయ సిబ్బందికి వినతిని అందజేస్తున్న సిపిఎం నాయకులు

క్రమశిక్షణ, అంకితభావమే ఈ స్థితికి చేర్చింది

మాజీ డిప్యూటీ సిఎం రాజన్న దొర

ప్రజాశక్తి - మక్కువ

వృత్తిపట్ల క్రమశిక్షణతో కూడిన అంకిత భావం ద్వారా ఎంఇఒ పెంట సత్యనారాయణ ఉన్నత ఉద్యోగ స్థితికి చేరుకున్నారని మాజీ డిప్యూటీ సిఎం పీడిక రాజన్నదొర అన్నారు. శనివారం ఉద్యోగ విరమణ చేయనున్న ఎంఇఒ సత్యనారాయణ వీడ్కోలు సభకు శుక్రవారం ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజన్నదొర మాట్లాడుతూ సత్యనారాయణ, తాను క్లాస్ మీట్‌తో పాటు బాల్యమిత్రుడని అన్నారు. చదువుకున్న రోజుల నుంచి ఉన్నత భావాలతో మెలిగేవాడన్నారు. తల్లితండ్రుల క్రమశిక్షణతో పిల్లలను పెంచగలిగితే ఏ విధంగా ఉన్నత శిఖరాలకు చేరుకుంటారో సత్యనారాయణ కుటుంబం చూస్తే అర్థమవుతోందని తెలిపారు. ఉద్యోగ విరమణ చేసిన తర్వాత మంచి సేవా జీవితాన్ని కొనసాగించాలని ఆయన కోరారు. అనంతరం సత్యనారాయణ దంపతులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులు నాయుడు, విశ్రాంత డిఇఒ ఎన్.తిరుపతి నాయుడు, జెడ్‌పిటిసి సభ్యులు మామిడి శ్రీనివాసరావు, మండల వైసిపి అధ్యక్షులు ఎం.రంగునాయుడు టిడిపి సీనియర్ నాయకులు ఎం.ప్రసాదరావు నాయుడు, ఎంపిడిఒ డిడి స్వరూప రాణి మండలంలోని అన్ని శాఖల ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు, ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఒఎస్ నుండి ఎంఇఒ వరకు..

ఉద్యోగ విరమణ చేయబోతున్న ఎంఇఒ పెంట సత్యనారాయణ మండలంలోని సంబర గ్రామానికి చెందిన వారు. విద్యాశాఖలో ఒఎస్‌గా ఉద్యోగ ప్రస్థానం ప్రారంభమై ఎంఇఒ స్థాయికి ఎదిగారు. సుమారు 40ఏళ్లపైబడి ఉద్యోగ జీవితాన్ని కొనసాగించారు. సాలూరులో హిందీ ఉపాధ్యాయులుగా కూడా పనిచేశారు. ఆయనకు ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. వీరు సాంకేతిక విద్య పట్టభద్రులై ఉన్నత ఉద్యోగాలు చేస్తున్నారు



ఎంఇఒ దంపతులకు జ్ఞాపికను అందజేస్తున్న మాజీ డిప్యూటీ సిఎం రాజన్నదొర

అధ్వాన్నంగా ఉన్న మొండెంఖల్ జిసిసి డిపో

శిథిలావస్థలో మొండెంఖల్ జిసిసి డిపో

- విరిగిపోతున్న పైకప్పు రేకులు
- బీటలు వారిన గోడలు

ప్రజాశక్తి - కురుపాం

మండలంలోని మొండెంఖల్ జిసిసి డిపో శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా తయారయ్యింది. రేషన్ బియ్యం డిపోలు వద్దె పంపిణీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొని జూన్ ఒకటో తేదీ నుండి అమలు చేయాలని ఆదేశాలు జారీ చేసింది. డిపో శిథిలావస్థకు చేరుకోవడంతో రేషన్ సరుకులు ప్రజలకు ఎక్కడ నుండి అందజేస్తామని సిబ్బంది తలలు పట్టుకుంటున్నారు. ఇదే డిపో వద్ద గాని బియ్యం, నిత్యవసర సరుకులు ఉంచి పంపిణీ చేయాలని అధికారులు చూస్తే మాత్రం డిపో కారిపోతుండడం వల్ల వర్షాలకు తడిసి బియ్యం పాడైపోయే అవకాశాలు ఉన్నాయని చెబుతున్నారు. పైగా శిథిల డిపో వద్ద రేషన్ అందుకోవాలంటే బిక్కుబిక్కుమంటూ ప్రాణాలు అరచేత పెట్టుకొని రేషన్ తీసుకోవలసిన పరిస్థితి వస్తుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పాడుబడిన డిపో పరిసర ప్రాంతాల్లో వ్యాపారస్తులు వారు యొక్క సామాగ్రి గజాలు, తదితర వస్తువులు అక్కడ పెట్టుకుంటూ వాడుకుంటున్నారని అధికారులు స్పందించి డిపోకు మరమ్మతులు చేపట్టి పరిసర ప్రాంతాల్లో ఎటువంటి సామాగ్రి లేకుండా చూడాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

ప్రజాశక్తి - రామభద్రపురం

ఆరికతోట గ్రామ శివారులో జాతీయ రహదారి సమీపంలో శుక్రవారం నేల బావిలో గుర్తుతెలియని వ్యక్తి మృత దేహం లభ్యమైనట్లు ఎస్ఐ ప్రసాదరావు తెలిపారు. ఒక పొలం యజమాని బావిలో మృతదేహం ఉన్నట్లు గుర్తించి ఇచ్చిన సమాచారం మేరకు సిబ్బందితో ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించి మృతదేహాన్ని బయటకు తీయించి పంచనామా నిర్వహించామన్నారు. 30 నుంచి 40 ఏళ్ల వయస్సుతో ధృడమైన శరీరాకృతి కలిగి చామన ఛాయ రూపంతో నూతిలో బోర్లా పడి ఉన్నడని తెలిపారు. అటుగా వచ్చి నేల బావి ఉన్నట్లు గుర్తించక ప్రమాదంలో చిక్కుకున్నాడా? ఇంకేమైనా సంఘటన జరిగిందా అనేది దర్యాప్తులో తేటతెల్లం అవుతుందన్నారు. దీనిపై కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రుకి తరలించామన్నారు. ఘటనా స్థలాన్ని బొబ్బిలి డిఎస్‌పి భవ్య రెడ్డి సందర్శించారు.

సేవలతోనే రోటరీకి గుర్తింపు

ప్రజాశక్తి- బొబ్బిలి

సేవలతోనే అంతర్జాతీయ రోటరీ సంస్థకు సమాజంలో గుర్తింపు తీసుకొని రావాల్సిన బాధ్యత రోటరీ నాయకులకు, సభ్యులకు ఉందని రోటరీ జిల్లా 3020 మెంబెర్ షిప్ అధ్యక్షులు ఎవి రంగారావు సూచించారు. శుక్రవారం స్థానిక రోటరీ కార్యాలయంలో క్లబ్ అధ్యక్షులు సింద్రీ శ్రీనివాసన్ అధ్యక్షతన క్లబ్ అసెంబ్లీ సమావేశాన్ని నిర్వహించారు. సమావే శానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎవి రంగారావు మాట్లాడుతూ రోటరీ సంస్థలో సేవచేయగల, నిబద్ధత, మంచినడవడిక, మంచి వృత్తి నైపుణ్యం కలిగిన వారిని సభ్యులుగా చేర్పించాలన్నారు. సభ్యుల నైతిక ప్రవర్తన, గౌరవ ప్రదమైన జీవిన విధానం ద్వారా రోటరీ సంస్థకు గౌరవ మర్యాదలు పెరుగుతాయన్నారు. జిల్లా చైర్మన్ జెసి రాజు మాట్లాడుతూ సంక్షేమ వసతి గృహాల్లో చదివే 250 మంది విద్యార్థులకు పరుపులు అందించే ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

ఎస్.కోటలో 10న యోగాంధ్ర రాష్ట్ర స్థాయి కార్యక్రమం

ప్రజాశక్తి-విజయనగరం

ఉపాధి వేతనదారులతో జూన్ 10న రాష్ట్రస్థాయి యోగాంధ్ర కార్యక్రమాన్ని ఎస్.కోటలో నిర్వహించనున్నట్టు జాయింట్ కలెక్టర్ ఎస్.సేథుమాధవన్ వెల్లడించారు. సుమారు 5వేల మంది వేతనదారులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారని, ఇందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని జిల్లా అధికారులను ఆదేశించారు.